# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

**పత్రికా ప్రకటన** **తేది: 16-02-2015**

రోళ్లపాడు రిజర్వాయర్ నిర్మాణం వల్ల నష్టపోయే గిరిజన రైతులకు సంపూర్ణ పునరావాసం కల్పించే బాధ్యత తాను తీసుకుంటానని, రిజర్వాయర్ నిర్మించడం వల్ల తాము బాగుపడ్డామే తప్ప నష్టపోలేదనే భావన నిర్వాసితుల్లో కల్పిస్తామని ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర్ రావు అన్నారు. ఖమ్మం జిల్లా రోళ్లపాడు వద్ద సీతారామ సాగునీటి పథకానికి శంఖుస్థాపన చేసిన అనంతరం గిరిజన భూ నిర్వాసితులతో ముఖ్యమంత్రి భోజన సమయంలో ప్రత్యేకంగా మాట్లాడారు.

రోళ్లపాడు, సమీప తాండాలకు చెందిన 246 కుటుంబాలు భూములు, ఇండ్లు కోల్పోతున్నారని ముఖ్యమంత్రి అన్నారు. వారికి పూర్తి పునరావాసం కల్పిస్తామని, నిర్వాసితులు గిరిజనులైనందున ప్రభుత్వం మరింత సానుభూతితో వ్యవహరించి మరో చోట ప్రభుత్వమే డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను నిర్మించి అందరూ ఒకే దగ్గర ఉండే విధంగా ఆధునిక గిరిజన గ్రామం నిర్మిస్తామన్నారు. ఆ గ్రామానికి మంచి రహదారి, విద్యుత్, మంచినీరు తదితర మౌలిక సదుపాయాలన్నీ కల్పిస్తామని హామీనిచ్చారు. మళ్లీ వ్యవసాయం చేసుకోవడానికి, ఇతర పనులు చేసుకోవడానికి అవసరమయ్యే విధంగా ట్రాక్టర్లు కానీ మరేదైనా కానీ కొనడానికి సహకరిస్తామని చెప్పారు. రూపాయి నష్టపోతే పది రూపాయల లాభం పొందామని భావితరాలు కూడా అనుకునే విధంగా పునరావాసం కల్పిస్తామన్నారు. పోయిన ఇండ్లకు కూడా సరైన పరిహారం అందిస్తామన్నారు. నిర్వాసితుల ఇండ్లు, పశువుల కొట్టాలలాంటి స్థిర ఆస్తులను వెంటనే లెక్కగట్టి చెక్కు రూపంలో ఇంటికి డబ్బులు పంపాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు, టి.హరీష్ రావు, ఎంపీ సితారామ్‌నాయక్, ఇల్లందు ఎమ్మెల్యే కనకయ్య, జిల్లాకు చెందిన అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

**సిపిఆర్ఓ టు సిఎం**